నవతెలంగాణ
ఆదిలాబాద్
బుధవారం | జులై 10, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లు, పెన్నుల పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలో మంగళవారం జిల్లా ప్రముఖ వైద్యుడు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు టిఫిన్ బాక్స్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. పేద విద్యార్థుల కోసం సేవ చేయడం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్బాల్, సాయి, ఖాసిం, నర్సిములు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శన


నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం డీఐఈఓ రవీందర్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సోమవారం కురిసిన వర్షంతో కళాశాలలో నీరు చేరడంతో నీరు నిల్వ ఉండకుండా మరమ్మతు పనులు చేపట్టాలని ప్రిన్సిపల్ మహేందర్ కుమార్‌ను ఆదేశించారు. తరగతి గదులు, లైబ్రరీ, రికార్డులు తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ రోజు కళాశాలకు వచ్చి మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం కళాశాల సిబ్బందితో కలిసి ఆవరణలో మొక్కలు నాటారు. వారి వెంట సూపరింటెండెంట్ మోసిన్, కళాశాల ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లే ఉన్నారు.

టీచర్లు కావలెను..!

- బదిలీలు, పదోన్నతులతో అనేక బడుల్లో ఖాళీలు
- బదిలీ అయిన ఉపాధ్యాయులూ రిలీవ్‌కాని వైనం
- విద్యావాలంటీర్ల నియామకమే తక్షణ పరిష్కారం
- దృష్టిసారించాలంటున్న విద్యార్థులు,తల్లిదండ్రులు





సర్కారు బడుల్లో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవల విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో మరిన్ని ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో టీచర్లు లేక బడులు ఖాళీ అవుతున్నాయనే ఉద్దేశంతో 50మంది బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ సమస్యను పరిష్కరించాలంటే తక్షణం విద్యావాలంటీర్లను నియమించడమే ఏకైక మార్గమని ఉపాధ్యాయవర్గాలు చెబుతున్నారు. డీఎస్సీ నిర్వహించినా.. ఈ ప్రక్రియలో కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకమే సరైన మార్గంగా కనిపిస్తోంది. మరోపక్క ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతుల కారణంగానూ ఖాళీలు ఏర్పడగా వీటిని భర్తీ చేయాల్సిన అవసరం విద్యాశాఖపై ఉంది. లేదంటే సర్కారు బడుల్లో చదువుకొనే పేద విద్యార్థులు బోధకులు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యాశాఖ చేపట్టిన బదిలీలు, పదోన్నతులతో ఉపాధ్యాయవర్గాల్లో సంతోషం నింపగా.. ఇన్నాండ్లు చదువుచెప్పిన టీచర్లు ఇతర చోటకు వెళ్లిపోయారనే బాధ విద్యార్థుల్లో మిగిలిపోయింది. సుదీర్ఘకాలం తర్వాత చేపట్టిన ఈ ప్రక్రియతో సర్కారు బడులు మరో సమస్యను ఎదుర్కొంటున్నాయి. బదిలీలు, పదోన్నతులతో ఒక బడి నుంచి మరో పాఠశాలకు ఉపాధ్యాయులు వెళ్లినా.. ఎవరూ కోరుకోని మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. చాలా వరకు మారుమూల ప్రాంతాల్లో ఉన్న బడులను బదిలీల్లో భాగంగా ఉపాధ్యాయులు కోరుకోకపోవడంతో వాటిలో బోధన చేయడం సమస్యగా మారుతోంది. ఆదిలాబాద్ జిల్లా విషయానికి వస్తే ఇటీవల 114మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందగా మరో 700మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారు ఆయా పాఠశాలల నుంచి రిలీవ్ కావాలంటే వారు పనిచేస్తున్న బడుల్లో సరిపడినంత ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంటుంది. లేదంటే అక్కడికి కొత్తగా వచ్చిన వారైనా ఉండాలి. కానీ ఇప్పటికే ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇబ్బందులు పడిన బడులు.. తాజాగా బదిలీలు, పదోన్నతులతో మరిన్ని అవస్థలు ఎదుర్కొంటున్నాయి. కొందరు ఎస్జీటీలు పదోన్నతులతో ఉన్నత పాఠశాలకు వెళ్లిపోగా.. బదిలీల్లో భాగంగా మారుమూల ప్రాంతాలను ఎవరూ కోరుకోకపోవడం సమస్యగా మారుతోంది. ముఖ్యంగా పదోన్నతుల్లో భాగంగా కొందరికి రెండు, మూడు పదోన్నతులు రాగా.. ఒకదానిని ఎంచుకున్నారు. దీంతో సుమారు 39పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి.

మచ్చుకు కొన్ని ఉదాహరణలివి..!

* బేల మండలం గోండుగూడ(సి) పాఠశాలలో 67మంది పిల్లలున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా ఇందులో ఒకరు పదోన్నతిపై వెళ్లిపోయారు. మరో ఉపాధ్యాయుడికి బదిలీ అయింది. కానీ రిలీవ్ కాలేదు. ఇక్కడ కొత్తగా టీచర్లు నియమిస్తేనే విద్యార్థులకు బోధన జరుగుతుంది.
* భీంపూర్ మండలం రాజుల్‌వాడి పాఠశాలలో 20మంది పిల్లలు ఉండగా ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందారు. తాజా బదిలీల్లో ఈ పాఠశాలను ఎవరూ కోరుకోలేదు. దీంతో సమీప పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై ఓ ఉపాధ్యాయుడితో బోధన చేయిస్తున్నారు.
* బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్ పాఠశాలలో 45మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఈ స్థానాన్ని ఎవరూ కోరుకోకపోవడంతో ప్రస్తుతం ఈ పాఠశాలకు కొత్తగా ఉపాధ్యాయులు రాలేకపోయారు. దీంతో బదిలీ అయిన ఉపాధ్యాయులను అధికారులు రిలీవ్ చేయలేదు.
* బేల మండలం జునోని పాఠశాలలో 45మంది పిల్లలున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే మిగిలారు. మరో స్థానం కోసం తాజా బదిలీల్లో ఎవరూ కోరుకోలేదు. దీంతో ఇక్కడ మరో ఉపాధ్యాయుడిని నియమించాల్సి ఉంటుంది. ఇలా ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతులతో అనేక బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతోంది.

విద్యావాలంటీర్లే ప్రత్యామ్నాయం..!

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియడంతో సర్కారు బడుల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. వాస్తవానికి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి వీటిని భర్తీ చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ చేపట్టాలంటే కొంత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఇప్పటికే బదిలీల కారణంగా చాలా బడుల్లో బోధకుల సమస్య ఏర్పడటంతో తక్షణం నియమించాల్సిన అవసరం ఉంది. గతంలో విద్యావాలంటీర్లను నియమించిన ప్రభుత్వం అనంతరం టీఆర్‌టీ నిర్వహించి కొంత మేరకు భర్తీ చేసింది. తాజాగా ఏర్పడిన ఖాళీలతో తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించడమా.. లేదంటే సర్దుబాటు చేయడమా అనేది తేలాల్సి ఉంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా..ఉపాధ్యాయుల నియామకం తప్పనిసరిగా చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది

టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ అయిన స్థానాల్లో ఉపాధ్యాయుల నియామకం విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. డీఎస్సీ నిర్వహించడమా.. లేదంటే విద్యావాలంటీర్లను నియమిస్తుందా అనేది తెలియాల్సి ఉంది.

పేదలకు వరం కల్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెండ్లిల కోసం ప్రభుత్వం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తుందని అన్నారు. త్వరలో రూ.1లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని పేర్కొన్నారు. చెక్కులను సకాలంలో బ్యాంకులో జమ చేసి విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తుందన్నారు. కడెం ప్రాజెక్టు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9కోట్ల 21 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. మరోవైపు సదర్మాట్ కెనాల్‌ను పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కడెం తహసీల్దార్ సుజాతరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మెన్ శైలజ రమేష్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్, కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షులు గొల్ల వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడిగెల భూషణ్, తాళ్ల పెల్లి రమేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయుడికి సన్మానం



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌రావు బదిలీపై హవర్గ ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సవ్వ పోతన్న, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, వీడీసీ చైర్మెన్ దాసరి ప్రవీణ్, వైస్ చైర్మెన్ బాలరాజుగౌడ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందుర్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విషంరావు అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఉట్నూర్‌లోని గుస్సాడి గుట్టలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదివాసులకు సంస్కృతి సాంప్రదాయాలు భాష అభివృద్ధి, సమస్యల గుర్తింపు, కొరకు ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9న దినోత్సవం ప్రకటించింది. ఈ సందర్భంగా వారి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తూ ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తుందని అధికారికంగా జరుపుకోవాలని అన్నారు.

క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

- స్టేడియంలో ఈత పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రతిభ చాటాలని గిరిజన క్రీడాభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. ఈనెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. దీనికి సంబంధించి మంగళవారం స్టేడియంలో జిల్లా క్రీడాకారులను ఎంపిక చేయడానికి పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందించారు. స్విమ్మింగ్ అంతర్జాతీయ క్రీడ అని, అభివృద్ధి చెందిన దేశాలు మంచిగా రాణిస్తున్నాయని అన్నారు. పిల్లలను కేవలం సమ్మర్‌లోనే స్విమ్మింగ్ పంపుతున్నారని, నిత్యం పంపిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. ఒలంపిక్స్‌లో కూడా స్విమ్మింగ్‌కు గుర్తింపు ఉందన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన 15 మంది ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేకే అకాడమి కోచ్‌లు కొమ్ము కృష్ణ, కాంతు, స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ కుమార్ పాల్గొన్నారు.

అధికారుల బృందంపై తేనెటీగల దాడి..!

- ఇరిగేషన్ ఎస్ఈకి తీవ్ర గాయాలు
- జిల్లా కలెక్టర్‌కు తప్పిన ముప్పు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున నిర్మించిన చనక-కోర్ట బ్యారేజీ పంప్‌హౌస్ పరిశీలనకు వెళ్లిన అధికారుల బృందంపై తేనెటీగలు దాడి చేయడం కలకలం రేపింది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో తొలుత బ్యారేజీని సందర్శించిన అధికారులు అనంతరం సమీపంలోని పంప్‌హౌస్ వద్దకు వెళ్లారు. వారు వెళ్లగానే అక్కడి తేనెతుట్టే ఉండటంతో తేనెటీగలు ఒక్కసారిగా వారిపైకి దూసుకొచ్చాయి. వెంటనే అప్రమత్తమైన జిల్లా కలెక్టర్ రాజర్షిషా సహా మరికొందరు ఇరిగేషన్ అధికారులు వాహనాల్లోకి వెళ్లి కూర్చున్నారు. తేనెటీగల నుంచి తప్పించుకునే క్రమంలో ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ రాముపై తేనెటీగలు ముకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్లు తెలిసింది. మరోపక్క జిల్లా కలెక్టర్‌తో పాటు మరికొందరు అధికారులు, సిబ్బందికి కూడా స్వల్ప గాయాలైనట్లు తెలిసింది.

తొలగిస్తేనే తప్పనున్న ముప్పు..!

సాధారణంగా తేనెటీగలు వాటికి అనువైన చోటును ఎంచుకొని తేనెతుట్టెను పెడుతుంటాయి. సాధారణంగా ఇవి ఇనుప వస్తువులను ఎక్కువగా ఆకర్షిస్తుంటాయి దీంతో ఇనుము వస్తువులు అధికంగా ఉండే బ్యారేజీలు, ప్రాజెక్టులతో పాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ భవనాల వద్ద ఎక్కువగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా రిమ్స్‌లో రోగులు చికిత్స పొందుతున్న ఆసుపత్రి భవనాలకు సైతం పదుల సంఖ్యలో తేనెతుట్టెలు ఉన్నాయి. భవిష్యత్తులో వీటి కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుండా ఉండాలంటే వీటిని తొలగించేందుకు ఇద్దరు లేదా ముగ్గురు సిబ్బందిని నియమిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ కట్టడాలకు సంబంధించి ఎక్కడ తేనెతుట్టె కనిపించినా ముందస్తుగానే వాటిని తొలగించేందుకు ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే ఉన్నతాధికారులతో పాటు ఆయాశాఖలకు చెందిన అధికారులు పలుమార్లు ఆయా కట్టడాలను సందర్శించడం వంటి పరిస్థితులు ఉంటాయి. కనుక ఇలాంటి ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలనే అభిప్రాయం అధికారుల నుంచి వినిపిస్తోంది.

జూనియర్ లెక్చరర్‌గా గుమ్ముల కార్తీక్

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన గుమ్ముల కార్తీక్ జంతు శాస్త్ర విభాగ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. 2023 సెప్టెంబర్‌లో రాసిన పరీక్ష తుది ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఈ పరీక్ష ఫలితాల్లో కార్తీక్ రాష్ట్రంలో 30వ ర్యాంకు సాధించగా, మల్టీజోన్ 1లో 19వ ర్యాంకు సాధించారు. దీనితో పాటు గ్రూప్ 4లో 1:3 లిస్ట్, గ్రూప్1 మెయిన్స్‌కి కూడా అర్హత సాధించారు. సుంకిడి గ్రామానికి చెందిన గుమ్ముల ఆశన్న పోసాని, దంపతులు వ్యవసాయ కూలీలు, వీరికి కుమార్తె, కుమారుడు కార్తీక్ విద్యాభ్యాసం 1వ తరగతి నుంచి 10 తరగతి వరకు స్వగ్రామం సుంకిడిలోనే పూర్తి చేశారు. ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తాంసిలో చదవగా గౌతమి డిగ్రీ కళాశాల ఆదిలాబాద్‌లో పీజీ జంతుశాస్త్ర విభాగం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎడ్ ప్రభుత్వ ఉపాధ్యాయ కళాశాల మహబూబ్‌నగర్‌లో పూర్తి చేశారు. అధ్యాపకుల స్ఫూర్తితో ఎలాగైనా జూనియర్ లెక్చరర్ జంతుశాస్త్ర విభాగంలో ఉద్యోగం సాధించాలనే పట్టుదలగా చదివినట్లు కార్తీక్ తెలిపారు. ఉపాధ్యాయులైనటువంటి డా.ముమ్మడి నర్సింగ్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ జూవలజీ స్ఫూర్తి, ప్రోత్సాహకాలతో కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించినట్టు తెలిపారు. కృషి పట్టుదలతో చదివితే అన్ని రంగాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు.

ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఉపాధి హామీ కూలీల డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు సమయానికి కూలీ డబ్బులను చెల్లించక పోవడం వల్ల వారి కుటుంబాల పోషణ బారంగా మారుతుందని అన్నారు. వివిధ గ్రామాల్లో వందరోజులు పని కల్పించలేని కూలీలకు ప్రభుత్వం పనికల్పించి, కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజల భద్రతకే పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-దస్తురాబాద్

ప్రజల భద్రతకే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మంగళవారం మండలంలోని మున్యాల్ ఉదయం సీఐ, ఐదుగురు ఎస్సైలు, 50 మంది పోలీసుల సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 89 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 1 ట్రాక్టర్, ఒక కారు సరైన ధృవపత్రాలు లేనందున పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడంతో పాటు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధృవపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనాలపై జరిమానాలు ఉన్నట్లయితే ఎప్పటికప్పుడు చెల్లించుకోవాలని లేని ఎడల వాహనాలను సీజ్ చేయబడతాయని తెలిపారు. ప్రజల రక్షణర్థమే కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని అన్నారు. అసాంఘిక కార్యక్రమలకు దూరంగా ఉండి, ప్రశాంత జీవనం కొనసాగాలని కోరారు. ఎవరికైనా సమస్యలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వావాహనాలకు జరిమానా విధించారు. ఇందులో భాగంగా సర్కిల్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తా

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-కుభీర్

నన్ను గెలిపించిన ముధోల్ నియోజక వర్గ ప్రజలకు అండగా ఉండి వారికి సేవలు చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని పార్డి(బి) గ్రామంలో రూ.16లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి రూ.13లక్షల 50 నిధులు మంజూరు కావడంతో వాటి పనులకు ఎమ్మెల్యే మండల నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బడుగు బలహీన వర్గాలు ప్రజలకు ముఖ్యంగా విద్యా వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అదే విధంగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైదులు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రజలను ఎప్పటికప్పుడు పరీక్షించి, వారికి ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు అన్ని రకాల ఆట వస్తువులు అందించేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సోము, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీ రేఖామోహన్ కానోబా, మండల బీజేపీ అధ్యక్షుడు ఈశాల దత్తాత్రి సర్పంచులు శంకర్ రాథోడ్, మండల నాయకులు, బోయిడి విఠల్, నగేష్ మండల విద్యాధికారి చంద్రకాంత్, అమ్మ ఆదర్శ చైర్మెన్ లక్ష్మీ, ఈఈ గంగాధర్, జేఏ మహేష్, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎంపీటీసీని సన్మానించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం

పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ జయసాగర్ రావును మంగళవారం ఎంపీడీఓ సోలేమాన్ రాజ్ శాలువా కప్పి సన్మానించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఐదు సంవత్సరాలు ఎంపీటీసీగా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. జీవితంలో మరెన్నో ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంధం వినయ్‌సాయి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవతెలంగాణ-తాంసి



మండలంలోని కప్పర్ల ప్రభుత్వ పాఠశాలలో గత పన్నెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా పనిచేసి, ఎందరో విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను పాఠశాలలో మంగళవారం మాజీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు విద్యార్థుల తల్లీదండ్రులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పాఠశాలకు చేసిన సేవలను, విద్యార్థులకు చెప్పిన విద్యను కొనియాడారు. విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదానందం, గ్రామస్తులు మహేందర్, నారాయణ, గంగయ్య, సంతోష్ ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-దస్తురాబాద్



వర్షాకాలంలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని దస్తురాబాద్ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సూచించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు ఎక్కడ నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుగుణ, దేవి, రత్నమాల, భారతి, ఆశా కార్యకర్తలు గోదావరి, సుజాత ఉన్నారు.

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్థానిక హరిత రిసార్టును ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పితే ప్రజలు ఊరుకోరని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, రద్దు చేస్తామని తెలిపారు. లేనియెడల ప్రజలు రోడ్డు మీదికి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితులు తెచ్చుకోవద్దని, ప్రయివేటు వ్యక్తులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కడెం పెద్దూర్‌లో నిర్మించినటువంటి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, సీసీ రోడ్లు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యాలు పూర్తికాగానే ప్రభుత్వం తరఫున అధికారికంగా అర్హులను గుర్తించి పంపిణీ చేస్తామని తెలిపారు. ఇష్టానుసారంగా చొరబడితే చర్యలు తప్పవన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరు మీద రాజకీయాలు చేయడం మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు తారి శంకర్, కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షులు గొల్ల వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడిగెల భూషణ్, తాళ్ల పెళ్లి రమేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీనివాస్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల శ్రేయస్సు కోరే ప్రజా నాయకురాలు మంత్రి సీతక్క అని అన్నారు. నిరంతరం పేదల పక్షాన నిలబడతారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి మంత్రి సీతక్క ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో...

తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని వికాసం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ ముఖ్యఅతిథిగా హాజరై, కేక్ కట్ చేసి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు కేక్ తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ అన్ని అసమానతలతో పోరాడటం సీతక్క వ్యక్తిత్వమని, అణగారిన వర్గాల పక్షాన నిలబడాలన్నది ఆమె దృక్పథమని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జిల్లా అభివృద్ధికి మంత్రి సీతక్క అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ సమాజాన్ని అభివృద్ధి పథం వైపు నడిపేందుకు రాష్ట్ర మంత్రిగా సీతక్కకు దేవుడు పూర్తిస్థాయి శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, మైనార్టీ మండలాధ్యక్షుడు షేక్ సలీం, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆత్రం రాహుల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివాజీ దావత్, జిల్లా నాయకులు జితేందర్, ఆరిఫ్, మహిళా నాయకులు రాజవ్వ, కౌసల్య, సత్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంతో పాటు సొనాలలోని మార్కెట్ యార్డులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు రాజు యాదవ్, లోలపు పోశెట్టి, వీడీసీ అధ్యక్షులు గట్ల గంగాధర్, నాయకులు షేక్ షాకీర్, మేరుగు భోజన్న, శేఖర్, అబ్దుల్ హసీబ్ పాల్గొన్నారు.









ప్రమాదవశాత్తు లారీ కిందపడి డ్రైవర్ మృతి

నవతెలంగాణ-నేరడిగొండ



ప్రమాదవశాత్తు లారీ కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరెపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు లారీ కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ వడివేలు తంగావెల్(31) తమిళనాడు నుంచి రబ్బర్ లోడుతో ఢిల్లీకి వెళ్తూ ఉండగా, మండలంలోని ఆరెపల్లి గ్రామం వద్ద లారీకి వెనుక చక్రాల మధ్య సమస్య రావడంతో డ్రైవర్ లారీ నిలిపి సమస్యను పరిశీలిస్తూ ఉండగా ఒక్కసారిగా లారీ వెనుకకు రావడంతో వెనుక చక్రాల కింద మరమ్మత్తులు చేస్తున్న క్రమంలో వడివేలు తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచామని ఎస్సై తెలిపారు.

ఎంపీటీసీని సన్మానించిన గ్రామస్తులు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలో పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ నర్సవ్వ పోతన్నను గ్రామస్తులు పంచాయతీ కార్యాలయంలో సన్మానించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో వీడీసీ చైర్మెన్ దాసరి ప్రవీణ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ఎంపీటీసీగా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ అన్నారు. మంగళవారం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, తాగునీరు, స్నానపు గదుల సమస్యలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే చొరవ తీసుకొని, సమస్యను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకున్నా పాఠశాల నడపడం జరుగుతుందని తక్షణమే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీచేసే విధంగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లా నాయకులు ఎంబడి నరేందర్, పెందుర్ తుకారాం పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన వారికి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

ఇటీవల పదవీ విరమణ పొందిన వారికి మండల కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, ఎంపీటీసీ చంటిల పదవీ కాలం ముగియడంతో వారికి వీడ్కోలు పలుకుతూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబన్న, ప్రకాష్ రావు, మాజీ మండలాధ్యక్షులు కటకం దేవన్న, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ కాడే స్వామి, అంబేద్కర్ సంఘాల నాయకులు దేవన్న, శ్రీనివాస్, గంగన్న, నర్సింగ్, రవి, బీసీ సంఘ నాయకులు ఆసం రవి, వెంకన్న, రూపేష్, మేకల రవికాంత్, రెడ్డి సంఘం నాయకులు నల్ల పద్మాకర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, రావుల నారాయణ, ఇంద్రసేనరెడ్డి, ప్రమోద్, హన్మాండ్లు, లింగన్న, గ్యాంగ్ దిలీప్, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

భిక్షాటన చేపట్టిన అంగన్‌వాడీలు



- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. నిరాహార దీక్షలో భాగంగా మంగళవారం రెండో రోజు రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ పాత జీఓ నెం.10 ప్రకారం అతి తక్కువ డబ్బులు చెల్లించి జూలై 24 తర్వాత ఇంటికి పంపిస్తామని నిర్ణయం చేయడం అంటే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను మోసం చేయడం తప్ప మరొకటి లేదని మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీఓ నెం.10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2 లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 లక్ష పెంచుతూ కొత్త జీఓను జారీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో అంగన్‌వాడీలు 24 రోజుల పాటు సమ్మె చేస్తే కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయిన ఫలితం లేదన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పంచాయతీ కార్యదర్శి అరుణ్ అన్నారు. మంగళవారం మండలంలోని హవర్గ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్ వివరాలను, రికార్డులను, కేంద్రానికి వచ్చే చిన్నారుల, బాలింతల, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరు శాతం పెంచాలని, వారికి నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పుష్పలత ఉన్నారు.

ఘనంగా అకాడి పండుగ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కోసు పటేల్ గూడలో మంగళవారం అకాడి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వన దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని, పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా చూడాలని వన దేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ రావుజి, దేవారి జంగు బాపు, కోసేరావ్, యాదవ్‌రావ్, చందు, మారుతి పాల్గొన్నారు.

మంగ్లీలో వైద్యశిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని మామిడిగూడ సబ్ సెంటర్‌లోని పరిధిలోని మంగ్లీ గ్రామంలో వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ. గ్రామంలో 11 కుటుంబాలు ఉండగా, 57 మంది గ్రామ జనాభా ఉంటుంది. అక్కడికి వెళ్లి వైద్యం అందించాలంటే కొండలు, వాగులు, దాటుకుంటూ బురదలో నడుచుకుంటూ 6కిలోమీటర్లు వెళ్లి తిరిగి 6కిలో మీటర్లు నడుస్తూ రావాల్సి ఉంటుంది. అక్కడ గ్రామంలోని గర్భిణులకు, పిల్లలకు, వైద్యమందించారు. అనంతరం మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామస్తులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మర్సకొల లక్ష్మీబాయి, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్‌రెడ్డి, పవర్ ప్రేమ్ సింగ్, రాథోడ్ నారాయణ్, ముయ్యాల మోతీ, ఆశాకార్యకర్తలు సుమిత్ర, రుక్మిణి, తూర్పా బాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కడెం

విద్యుత్తు లైన్ మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ నాగరాజు తెలిపారు. మంగళవారం కడెం ప్రాజెక్టుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక లైన్ల మరమ్మత్తుల పనులను వారు పరిశీలించి మాట్లాడారు. మండలంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాలో భాగంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించి సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కడెం, దస్తురాబాద్ మండలాల విద్యుత్‌శాఖ అధికారులు సుమన్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-బేల

ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు రక్తదానం చేశారు. ముందుగా మహనీయుడు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సేవల సైతం ఏబీవీపీ ముందుంటుందన్నారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఏబీవీపీ క్రియాశీలకంగా వ్యవహరించిందన్నారు.విద్యారంగ సమస్యలే కాకుండా సామాజిక సమస్యలపై కూడా పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు దత్త నిక్కం, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, సంజయ్ గుండావార్, శివ కుమార్, నవీన్, రాము బర్కడే, రేసు మనోజ్ రెడ్డి, రాజు, శ్రీకాంత్, నార్లవార్ అజయ్, తరుణ్, శివరెడ్డి, పవన్‌రెడ్డి, యోగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 11న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంది లక్ష్మారెడ్డి, పడకంటి కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ శిబిరానికి తరలి రావాలని కోరారు.

మొక్కల పెంపకానికి ఆర్వోఎఫ్ఆర్ భూమి పరిశీలన



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వాగ్దారి గ్రామంలో ఆర్ఓఎఫ్ఆర్ వ్యవసాయ భూమిని ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. వాగ్దారి గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారుల నుంచి పది ఎకరాల బీడు భూమిని పరిశీలించినట్టు, ఈ భూమిలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నీలగిరి మొక్కలను పెంచడం జరుగుతుందని తెలిపారు. మొక్కలు పెరిగిన తర్వాత లబ్ధిదారులకు కొన్ని సంవత్సరాల తరువాత మంచి ఆదాయం ఉంటుందని, ఎంపీడీఓ రాజ్ వీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంత్‌రావ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం అలుపెరుగని పోరాటం చేస్తుందని ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు పొట్టిపెల్లి రవి కుమార్ అన్నారు. మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నేతాజీచౌక్‌లో నిర్వహించారు. ముందుగా వివేకానంద, సరస్వతి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ కార్యకర్తలు, రాళ్లబండి మహేందర్, వెంకటేష్, సురేందర్, జిల్లా కన్వీనర్ అక్షయ్, ప్రస్తుత కార్యకర్తలు మహేష్, నిఖిల్, ఉదయ్, విఘ్నేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జులై 10, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చిన వీఆర్‌ఏలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ సమస్యల పరిష్కారం కోసం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని జిల్లాలోని వీఆర్‌ఏలు ఎమ్మెల్యే కోవలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సమస్యలు పరిష్కారం కాకుండానే ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యను చర్చించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వీఆర్‌ఏల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాన్, నాయకులు శంకర్, అక్బర్, విశ్వాస్ పాల్గొన్నారు.

కంకర టిప్పర్ తగిలి కోడెలేగా మృతి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని కర్జెల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై కంకర టిప్పర్ తగిలి కోడేలేగ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..రాత్రి సమయంలో కంకర టిప్పర్ డ్రైవర్లు అతివేగంతో వెళ్తున్నారు. రహదారిపై ఉన్న కోడెలేగాను రాత్రి సమయంలో టిప్పర్ ఢీ కొట్టి వెళ్లింది. వేకు జామున చూసేసరికి కోడేలేగా తలపై నుండి తొక్కించుకొని పోగా అక్కడికక్కడే మృతి చెందినట్టు గ్రామస్తులు గుర్తించారు. కంకర టిప్పర్లు అధిక లోడ్ బరువు, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తులు తెలిపారు.

రైతు నేస్తంతో పంట సాగులో మెలుకువలు

● కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పంట సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించడంతో పాటు అధిక దిగుబడికి మెలకువలు అందించేందుకు రైతు నేస్తం కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం 15వ ధారావాహిక కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆర్. శ్రీనివాస్ రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వరి పంటలో స్వల్పకాలిక రకాల సాగు, ముఖ్యమైన పంటలలో కలుపు యాజమాన్యంపై రాష్ట్ర స్థాయి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 3 రైతు నేస్తం వీసీ యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను ప్రతి మంగళవారం జరిగే రైతు నేస్తం ముఖాముఖి కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ముందు ఉంచి, సందేహాలు నివృత్తి చేసుకొని మంచి దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమములో సహాయ వ్యవసాయ సంచాలకులు మిలింద్ కుమార్, వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామ పంచాయతీలో నర్సరీలోని మొక్కలను ఉపాధిహామీ కూలీలు, రైతులకు మాజీ సర్పంచ్ పెందూర్ పవన్ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు అందించే విధంగా పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా మొక్కలు నాటాలని కోరారు. పచ్చదనం ఉంటేనే వర్షాలు సక్రమంగా కురుస్తాయని, పచ్చదనం లేకపోవడంతోనే వర్షాలు కురవడంలేదని, అందరు సహకరించి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోశం, ఫీల్డ్ అసిస్టెంట్ దేవీదాస్, వసాకె ఆనంద్‌రావు, వీఓ నాయకులు రేణుక, అంగన్‌వాడీ టీచర్ పోచుబాయి, ఉపాధిహామీ మేటీలు పుష్పలత, శేఖర్, సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిఖం భూమిలోని ఆక్రమణలను తొలగించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని దరగుపెల్లి గ్రామ శివారులో గల ఉచ్చమల్ల వాగు ప్రాజెక్టు శిఖం భూమి ఆక్రమణకు గురైందని, భూ ఆక్రమణలు తొలగించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చేడువాయి అధ్యక్షులు బోయిర సోమన్న అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిఖం భూమిని 13 మంది కబ్జా చేసినట్లు ఆరోపించారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని మరొకసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ చెరువుపై ఆధారపడి 83 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధియే లక్ష్యం



నవతెలంగాణ-కౌటాల

విద్యాభివృద్ధియే లక్ష్యంగా పని చేస్తున్నామని పుస్తక పఠన డిస్ట్రిక్ లీడ్ సీనియర్ అసోసియేట్ జెన్నీఫర్ అన్నారు. మండలంలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో రూం టూ రీడ్ స్వచ్ఛంధ సంస్థ గ్రంథాలయ బుక్స్‌ను సమకూర్చింది. మంగళవారం మండలంలోని ఎంపీపీఎస్, ఎంపీయుపీఎస్ కన్నెపల్లి స్కూల్‌ను జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెచ్ఎం నారాయణ సింగ్, ముత్యంపేట కాంప్లెక్స్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం హనుమంతు, మాజీ ఎంపీపీ ఎస్.శిరీషతో కలిసి సందర్శించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. పాఠశాలల్లో చెక్ ఇన్ చెక్ అవుట్ రిజిస్టర్ నిర్వహణ, సీఎల్ఎంసీ కమిటీ నిర్వహణ అమలు తీరును అభినందించారు. ఇందులో రూమ్ టు రీడ్ బ్లాక్ కోఆర్డినేటర్ వేల్పుల సంపత్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని తమేళ ఎక్స్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇందులో వాంకిడి మండలంలోని బంబారా గ్రామానికి చెందిన సోముర్లె బాలుకు గాయలయ్యాయి. ద్విచక్ర వాహనం ఆసిఫాబాద్ నుండి మహారాష్ట్ర వైపుకు వెళ్తుండగా టోల్‌ప్లాజా వైపు వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ 100 వాహనం ఎదురెదురుగా అతివేగంగా వచ్చి తమేళ ఎక్స్ రోడ్డు సమీపంలో ఢీ కొనడంతో బాలుకు గాయాలైనట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

● కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-వాంకిడి

ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో ప్రభుత్వ ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి సేవా కేంద్రం పనితీరు, రికార్డులను పరిశీలించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో వివిధ రకాల పథకాలకు ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు పథకాలను అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలలన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు పథకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయనతో పాటు అదనపు దీపక్ తివారి, ఎంపీడీఓ, తహసీల్దార్, సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన కలెక్టర్

మండల కేంద్రంలోని నర్సరీని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మంగళవారం పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కలు, సంరక్షణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు పెరిగే విధంగా చూడాలని, అందరికీ అందుబాటులో ఉండే విధంగా వన మహోత్సవానికి అందించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని, నర్సరీలోని మొక్కలు పాఠశాల, గ్రామ పంచాయతీ వరణ, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా నాటాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ కలెక్టర్ దీపక్ త్రిపాఠి, తహసీల్దార్, సంబంధిత శాఖ అధికారులున్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



ఆసిఫాబాద్ : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీర శ్యాం నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రజా ప్రతినిధిగా ఉంటూ ఎంతో ఉత్తమమైన సేవలు ప్రజలకు అందిస్తున్న మహనీయురాలు మంత్రి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నిజాం, జక్కన్న, బాలేశ్, మంగ, అరీఫ్, హరిరామ్, రాపర్తి మురళి, మోహన్, బాలు, వెంకటేష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ షబ్బీర్‌హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇర్షాద్, రాణా ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

రెబ్బెన : మండల కేంద్రంలో పంచాయితీ రాజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లావుడ్యా రమేష్, రవి కుమార్, మాజీ జడ్పీటీసీ దుర్గం సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, మాజీ సర్పంచ్లు చెన్న సోమశేఖర్, లెండుగురే గంటుమేర, మైనార్టీ మండల అధ్యక్షుడు ఇమ్రోజ్, మోడెం చిరంజీవి గౌడ్, గొగర్ల రాజేష్, దుర్గం రవీందర్, గాజుల రవీందర్, కేసరి కిషన్ గౌడ్, పుదరి హరీష్, గుగ్లోత్ రవి నాయక్, సురేందర్ రాజు, ఏర్రం తిరుపతి, దుర్గం మహేష్, అజయ్ జైస్వాల్, పిర్సింగుల సుబ్బారావు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రెబ్బెన : కేక్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఉప్పొంగిన వాగులు తెగిన సంబంధాలు

జిల్లాలో విస్తారంగా వర్షాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సోమవారం సాయంత్రం నుండి విస్తారంగా వర్షాలు కురువగా మంగళవారం నాటికి పలు మండలాల్లో వాగులు ఉప్పొంగి గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. జిల్లాలో సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు 44.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం కురిసింది. దీనితో ఆసిఫాబాద్ మండలంలోని అప్పపెల్లి, గుండి గ్రామాలకు వెళ్లే మార్గమధ్యంలో ఉన్న వాగులు ఉప్పొంగడంతో జిల్లా కేంద్రంతో వాటి సంబంధాలు తెగిపోయాయి. రెండు రోజుల వర్షానికి ఎక్కడికక్కడ గ్రామాలు నిర్బంధంలో చిక్కుకుపోవడంతో గ్రామస్తులు ప్రతి సంవత్సరం తాము వేదన పడుతున్నామని అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పపెల్లి గ్రామానికి గతంలో కనీసం వాగు ప్రవాహం తగ్గినప్పుడైనా వెళ్లేలా ఉండేది. ప్రస్తుతం బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండడంతో ఆ పరిస్థితి కూడా లేకపోవడంతో గ్రామస్తులు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అధికారుల లెక్కల ప్రకారం సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో సగటు 44.5 మిల్లీ మీటర్ల వర్షపాతం కురియగా మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జైనూర్‌లో 39.2, సిర్పూర్(యు)లో 47.4, లింగాపూర్‌లో 91.2, తిర్యాణిలో 41.6, రెబ్బెనలో 66.0, ఆసిఫాబాద్‌లో 90.2, కెరమెరిలో 76.6, వాంకిడిలో 40.4, కాగజ్‌నగర్‌లో 41, సిర్పూర్(టి)లో 59.4, కౌటాలలో 3.4, చింతలమానపెల్లి 7.6, బెజ్జూర్‌లో 7.4, పెంచికలపేట 4.6, దహేగాం 4.4 మీమీల వర్షపాతం నమోదైంది.



ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు

బంజారు దొడ్డి పశువులకు వేలం

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని బంజారు దొడ్డిలో నాలుగు పశువులకు వేలం వేయనున్నట్టు గ్రామ కార్యదర్శి ఆసిఫ్ తెలిపారు. యాసంగి సీజన్‌లో పొలాలలో విత్తనాలు వేసి మొక్క మొలకెత్తే దశలో యజమానులు పట్టింపు లేకుండా పశువులను వదిలేయడంతో పంటలను పవుశులు నాశనం చేస్తున్నాయన్నారు. నాలుగు పశువులను గత ఆదివారం బంజారు దొడ్డిలో వేశామన్నారు. పశువు యజమానుల నుంచి ఎలాంటి స్పందన లేని కారణంగా వేలం వేస్తున్నట్లు తెలిపారు.వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేపు ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రాయితీ బస్సులు

నవతెలంగాణ-బెజ్జూర్

ఈనెల 11న మండల పరిషత్ కార్యాలయంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సు పాసులు ఇవ్వనున్నట్లు ఎంపీఓ రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిఎం బి.విశ్వనాథ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, జిరాక్స్ కాపీ, రెండు ఫోటోలు తీసుకొని రావాలని కోరారు.

ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 41 మందికి పరీక్షలు నిర్వహించగా 22 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి లయన్స్ క్లబ్, బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అప్తామలజిస్ట్ వసి, గోపి పాల్గొన్నారు.



బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. రిలే నిరాహార దీక్షకు గోలేటి బ్రాంచ్ సెక్రటరీ ఎస్ తిరుపతి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ బయ్య మొగిలి, ఖైరగూడ ఫిట్ సెక్రెటరీ మారం శ్రీనివాస్ యాదవ్, కాంటాక్ట్ కార్మిక సంఘం నాయకులు సల్లూరి అశోక్, సాగర్ గౌడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు గనులను నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూతన గనులు రాకుంటే సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దీక్షలలో బ్రాంచ్ ఆర్గనైసింగ్ కార్యదర్శులు బి. జగ్గయ్య, పిట్ కార్యదర్శులు ఎంబటి రామయ్య, డి. శ్రీధర్, కందుల మల్లేష్, రఘునాథ్ రెడ్డి, కోడం అశోక్, పుట్ట శ్రీను ఆశిష్, ప్రభాకర్, మురళీ పాల్గొన్నారు.

చదువుకు పోవాలంటే బురదతో కొట్లాడాల్సిందే



నవతెలంగాణ-రెబ్బెన

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గోలేటి గ్రామపంచాయతీలోని గోపాల్‌వాడకు వెళ్లాలంటే రోడ్డంతా బురదగా మారింది. దీంతో విద్యార్థులు చదువుకు వెళ్లాలంటే ఈ బురదతో కుస్తీపడి వెళ్లాల్సిందే. ఇప్పటికి పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు అంటున్నారు. విద్యతోనే సమాజ అభివృద్ధి అంటున్న అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్లను బాగుచేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, కాలనీవాసులు విన్నవిస్తున్నారు.

విద్యార్థుల ఇస్రో ఎన్‌ఆర్‌ఎస్సీ పర్యటన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో ఇస్రో ఎన్ఆర్ఎస్‌సీ పర్యటనకు వెళ్లారు. ఇస్రోలో అధికారులు చేస్తున్న పనితీరుకు సంబంధించిన వివరాలను విద్యార్థులు తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలతో పరస్పర క్రియాశీలతను కలిగి ఇస్రో కార్యక్రమాలు, రిమోట్ సెన్సింగ్, భవిష్యత్ ప్రాజెక్టులు, లాంచ్ వాహనాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో ముఖ్యాంశం రాకెట్ ప్రదర్శన, ఇది విద్యార్థులను స్పేస్ సైన్స్, టెక్నాలజీ పట్ల మరింత ప్రేరణతో నింపినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ మాజీ నాయకుడు మృతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు కార్మిక సంఘం మాజీ నాయకుడు వొల్లాల యాదగిరి (76) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న యాదగిరి పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ పట్టణంలోని అతని నివాసానికి తరలించగా. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు, ట్రేడ్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఈర్ల విశ్వేశ్వర్‌రావు, నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు కలికోట రమణయ్య తదితరులు నివాళులర్పించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకరించాలి

● ఎస్ఐ జి ఉదయ్ కిరణ్.

నవతెలంగాణ-దండేపల్లి

శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని శాంతి పద్ధతులకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ ఉదయ్ కిరణ్ అన్నారు. మంగళవారం అక్రమంగా తరలిస్తున్న గుట్కాను స్వాధీనం చేసుకొని విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారికి కాదని అన్నారు. గ్రామాలలో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా లేదా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని చిన్న వయసులోనే కుటుంబాలకు దూరమవుతున్నారని గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన కొరకు ప్రజలు పోలీసులతో కలిసి రావాలని ఆయన కోరారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని హెల్మెట్ తప్పనిసరి ధరించాలని సూచించారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ఎస్ఐ రాజ వర్ధన్

నవతెలంగాణ-జన్నారం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జన్నారం ఎస్ఐ రాజ వర్ధన్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని గ్రామంలోని యువకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గంజాయి, ఇతర మత్తు పానీయాలకు యువత దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి చదువులు చదివి గ్రామానికి వారి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, వార్డు సభ్యులు చిందం చంద్రయ్య, జాడి రాజన్న జాడి వెంకట్ జనుగూరు మల్లయ్య, గ్రామస్తులు రామిల్ల నరేష్, గుగులావత్ రవి, కామెర దుర్గయ్య, సంద లక్ష్మణ్, కుమ్మరి సత్తన్న, బోర్లకుంట లక్ష్మణ్ నీలం శేఖర్, గ్రామంలోని యువకులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

జిల్లా మహిళా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు రామస్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, భేటీ బచావో- భేటీ పడావో పథకం, పీసీపీఎన్ డీటీ యాక్ట్ (గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం) లింగ వివక్షత, లింగ సమానత్వం, గర్భిణీలు తీసుకునే పౌష్టికాహారం గురించి వివరించారు. డెలివరీ అయ్యాక శిశువు కి ముర్రుపాలు పట్టించాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 1930, సఖి సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజెన్ హెల్ప్ లైన్ నెంబర్ 14567, పోక్సో ఆక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నెంబర్ 112, సుకన్య సమృద్ధియోజనా, మిషన్ వాత్సల్య, ఆడ పిల్లల ప్రాముఖ్యత, ఇతర హెల్ప్ లైన్ నెంబర్లను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ మల్లీశ్వరి, కమల, విజయ, గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.

సింగరేణిలో ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని నిలిపివేయాలి

● ఏఐటీయూసీ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-జైపూర్

గతంలో ఎన్నడు లేనివిధంగా సింగరేణిలో తీసుకొచ్చిన ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం ఇందారం-1ఏ భూగర్భ గనితో పాటు ఇందారం ఓపెన్‌కాస్ట్ గని మేనేజర్లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎవ్వరికి తెలియనటువంటి ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. సీఎంఆర్-2017 కోడ్ ఆఫ్ డిసిప్లిన్‌లో ఎక్కడ లేకున్నా కూడా కొత్తగా సృష్టించిన తీరును కార్మికులను, సూపర్‌వైజర్లను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న కారణాలకు మూడు సార్లు ఎల్లో కార్డు ఇచ్చిన తదుపరి రెడ్ కార్డు ఇచ్చి తద్వార సస్పెండ్, చార్జీ షీట్లు ఇస్తామని అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అసలు ఎల్లో కార్డు, రెడ్ కార్డు అంటే ఏమిటో దాని విధానం కూడా ఏమిటో తెలియని కార్మికులను సూపర్‌వైజర్లను ఎల్లో, రెడ్ కార్డుల ద్వార వేధింపులకు గురి చేయడాన్ని భేషరతుగా నిలిపివేయాలని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ, నాగభూషణం, ఐకే ఓసీ పిట్ కార్యదర్శి అగ్గు శ్రీకాంత్, ఐకే-1ఏ పిట్ కార్యదర్శి నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాల సీసీసీలో 2024-25 విద్యా సంవత్సరానికి మిగిలిన ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు సీటు రద్దు చేసుకొని రావాలని, లేనిపక్షంలో సీటు కేటాయించబడదని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్‌సీపీ.ఎస్‌సీపాలిటెక్నిక్.కామ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాన్నారు. స్పాట్ అడ్మిషన్కు పాలిసెట్ 2024లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులతో సీట్లను భర్తీ చేయబడునని, అడ్మిషన్ కొరకు వచ్చేవారు ఒరిజినల్ సర్టిఫికెట్స్ 3 సెట్ల జిరాక్స్ కాపీలు, 3 కలర్ పాస్ పొటోస్ దరఖాస్తు ఫారంతో జత పరిచి తీసుకురావాలన్నారు. కాలేజీ ఫీజును నగదు రూపంలో కాకుండా ఫోన్ పే గూగుల్ పే మాత్రమే స్వీకరిస్తామన్నారు .

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి

నవతెలంగాణ-జైపూర్

మడలంలో గల ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికి మొక్కలు నాటించాలని, మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మద్దికల్, పోలంపల్లి గ్రామ పంచాయతీలలో వార్డుల వారిగా ప్రతి కుటుంబానికి ఆరు మొక్కలు పంపిణీ చేశారు. పూలు, పండ్లు, ఔషద గుణాలు కలిగిన మొక్కలు పంపిణీ చేసిన ఆమె మొక్కలు నాటడమే కాకుండా వాటిని సరంక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపు, ఈజీఎస్ ఏపీఓ జీనత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు ప్రశంసనీయం

నవతెలంగాణ-జన్నారం

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతి పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని గ్రామపంచాయతీ ఈఓ రాహుల్ అన్నారు. వర్షాకాలం ప్రారంభంకలో విధులు నిర్వహించే పంచాయతీ కార్మికులకు ఆయన రైన్ కోట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని కాలనీలలో పంచాయతీ కార్మికులు చెత్తను సేకరిస్తూ మంచి సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఇందారంలో మొక్కలు పంపిణీ చేసిన ఎంపీడీఓ

నవతెలంగాణ-జైపూర్

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇందారం గ్రామ పంచాయతీలో వివిధ వార్డుల వారికి స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్ మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మొక్కలు పంపిణీ చేసిన ఆయన గ్రామ పంచాయతీల పరిధిలో ప్రతి ఇంటికి మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని కోరారు. అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సంధర్శించి పరిసరాలను పరిశీలించిన ఆయన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

జీతాలు రావడంలేదని మున్సిపల్ కార్మికుల నిరసన

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపల్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు రావడం లేదని మంగళవారం మునిపాలిటీ కార్యాలయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్మికులు విధులు బహిష్కరించడంతో మున్సిపల్ కమిషనర్ సతీష్ స్పందించి వారి సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని చెప్పడంతో కార్మికులు విధులు నిర్వహించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో తొలగించిన 12 మంది కార్మికులను కూడా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

నవతెలంగాణ-జైపూర్



కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర స్థాయి సామాజిక శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కె మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం చెన్నూర్ పట్టణంలో కర పత్రాలను విడుల చేసిన ఆయన హన్మకొండ వేదికగా నిర్వహించనున్న శిక్షణ తరగతుల్లో చెన్నూర్ నియోజకవర్గం నుంచి అత్యధికంగా హాజరు కావాలని ఈ సంధర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ 1998 అక్టోబర్ 02న ఆత్మ గౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే లక్ష్యాల సాధన ఒక చారిత్రక అవసరంగా ఏర్పడిందని తెలిపారు. 26 ఏండ్ల సామాజిక ఉద్యమ ప్రస్థానం అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి 2013 నుండి 2024 వరకు సుదీర్ఘంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్ట సాధన కోసం రాష్ట్రంలో 102 సామాజిక సంఘాలను ఐక్యం చేసిన విశాల ఐద్యా ఉద్యమం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించిందని అన్నారు. కుల వివక్ష, అంటరానితనంపై వేలాది మంది కార్యకర్తలు వందల గ్రామాల్లో సర్వే నిర్వహించి సుమారు 128 రకాల కుల వివక్ష రూపాలను గుర్తించి వీటిని రూపుమాపడానికి ప్రత్యేక కమీషన్ వేయాలని కేవీపీఎస్ సుధీర్ఘ ఉద్యమం నిర్వహించి ఎస్సీఎస్టీ కమీషన్ సాధించిందని అన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు విద్యా వసతుల కల్పన, మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ప్రతి ఏడాది సంక్షేమ హాస్టల్ యాత్రలు నిర్వహించిందని అన్నారు. దళితులకు ఉచిత కరెంట్ ఇవ్వాలని, ప్రత్యేక ఉద్యమం నిర్వహించి 101 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 342 జీఓను సాధించిందని తెలిపారు. కులాంతర వివాహ ప్రత్యేక రక్షణ చట్టం కోరుతూ దశల వారిగా పోరాటం నిర్వహించిందని, రాష్ట్రంలో సుమారు 100కు దురఅహంకార హత్యలు జరిగిన నేపథ్యంలో బాధితుల తరపున కేవీపీఎస్ రాజీలేని పోరాటం నిర్వహించిన సంధర్భాలున్నాయని గుర్తు చేశారు. ఈ విధంగా అనేక పోరాటలు నిర్వహించిన కేవీపీఎస్ సామాజిక శిక్షణ తరగతులకు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మండల కన్వీనర్ జుమిడి కుమార్, కామెర మధూకర్, దుర్గం బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని నిరసన



నవతెలంగాణ-నస్పూర్

సేఫ్టీ పేరుతో ఎల్లో కార్డు, రెడ్ కార్డు విధానాన్ని వ్యతిరేకిస్తూ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియాలో మైనింగ్ స్టాఫ్, టెక్నికల్ సూపర్‌వైజర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో అన్ని గనులలో గని మేనేజర్లకు మెమోరాండాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేఫ్టీ పేరుతో సింగరేణి యాజమాన్యం ఎల్లో కార్డు, రెడ్ కార్డ్ విధానాన్ని తీసుకురావడం మూలంగా సింగరేణిలో ఉన్న మైనింగ్ స్టాప్ సూపర్‌వైజర్లు, టెక్నికల్ సూపర్‌వైజర్లు తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నారన్నారు. ఒకటి నుంచి మూడుసార్లు తప్పు చేస్తే ఎల్లో కార్డు విధానం ఆ తర్వాత రెడ్ కార్డుతో చార్జిషీట్లు, సస్పెండ్లు ఇంక్రిమెంట్ కోతలు ఇంకా తీవ్రమైన పనిష్మెంట్లు ఇచ్చే విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోల్ మైన్స్ రెగ్యులేషన్ రూల్స్ ప్రకారం సేఫ్టీ పేరుతో సూపర్‌వైజర్ స్టాఫ్‌కు శిక్షలు విధిస్తున్నారని, దానితోనే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ రూల్స్, చట్టంలో ఎక్కడా లేని ఇలాంటి విధానాలు అవలంబించడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. దీనిని వెంటనే ఉపసంహరించాలని లేనట్లయితే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, ఏరియా సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, జాయింట్ సెక్రెటరీ రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి జి నాగభూషణం, మైనింగ్ ఏరియా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, జాయింట్ సెక్రెటరీ రాజశేఖర్, దొంగిలి రామోజీ, గౌసుద్దీన్, ఆకుల రమేష్, శ్రీకాంత్, రామారావు, అడ్డు శ్రీనివాస్, సాయిబాబా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూ కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మందమర్రి



భూ కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు స్థానికుల వినతి పత్రం అందచేశారు. కేకే ఓసీ సమీపంలో గల సమాధుల స్థలాన్ని పవన్ కుమార్ అనే వ్యక్తి ట్రాక్టర్‌తో దున్నించి సమాధులను తొలగిస్తూ కబ్జాకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖరకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా ఆ స్థలంలో శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం సమాధులు కట్టడం జరిగిందని పేర్కొన్నారు. రోడ్డు పక్కన స్థలం కావడం ఇటీవల భూములకు రేట్లు పెరగడంతో పవన్ కుమార్ అనే వ్యక్తి ఈ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఆ భూమి జోలికి రావద్దని అది స్మశాన వాటికకు స్థానికులంతా వినియోగించుకుంటున్నారని తెలిపారు. జిల్లా అధికారులను పోలీసు యంత్రాంగాన్ని అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పవన్ కుమార్ అటు వైపు చూడవద్దని ఒకవేళ ఆ స్థలంలోకి అతను వస్తే స్థానికుల చేతిలో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్



నవతెలంగాణ-కాసిపేట

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ 11న నిర్వహించే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి వల్ల విద్యార్థులు చదువు అయిపోయినప్పటికీ సర్టిఫికెట్లు తీసుకొని, పై చదువులు చదవలేక పోతున్నారని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న వాటికి సొంత భవనాలు నిర్మించాలని, పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెండింగ్‌లో ఉన్న డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు శివకృష్ణ, అంజన్న, అరవింద్, శంరావు పాల్గొన్నారు.

రెండవ రోజు ఏఐటీయూసీ రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో వెలువడిన బొగ్గునిక్షేపాలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట కొనసాగింది. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య సందర్శించి వారికి సంఘీభావాన్ని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫీట్ కార్యదర్శులు గొల్లపల్లి రామచందర్, గునిగంటి నరసింహారావు, తిరుపతి, సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి సత్తిరెడ్డి, జీపీ రావు పాల్గొన్నారు.

గొల్లగూడెం నుంచి కంకలొర్రెకు వెళ్లే రహదారి వెయ్యాలి

● సీపీఐ(ఎం) మండల నాయకురాలు సిడం జంగునాయి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మల్కెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం నుంచి కంకలొర్రె వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే మనుషులు నడవకుండా బురదతో, నీళ్ళ మడుగుతో అసౌకర్యంగా ఏర్పడుతుందని, వెంటనే ఆ రోడ్డు వేయాలని సీపీఐ(ఎం) మండల నాయకురాలు సిడం జంగునాయి డిమాండ్ చేశారు. మంగళవారం రోడ్డును పరిశీలించిన సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడారు. వ్యవసాయ పనులకు వెళ్ళే రైతులకు, కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, కనీసం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు కూడ వెళ్లలేని పరిస్తితి ఉన్నదని, 2023 ఏప్రిల్ లోనే గత ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రోడ్డు వేయించడం కోసం భూమి పూజ చెయ్యడం జరిగిందని, కాని నేటి వరకు రోడ్డు పనులు ప్రారంభం కాలేదన్నారు. దీని వల్ల సుమారు 1000 ఎకరాల భూమి సాగు చేయ్యలేక రైతులు అధిక ఖర్చుల పాలవుతున్నారని, ప్రస్తుత ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు వేయించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)లో పలువురు చేరిక

నవతెలంగాణ-జన్నారం



పేద ప్రజల పక్షాన సీపీఐ(ఎం) నిలుస్తుందని ఆ పార్టీ జన్నారం మండల కార్యదర్శి కనికారం అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని కవ్వాల్ గ్రామపంచాయతీకి చెందిన కొత్తపేట గ్రామానికి చెందిన దాసండ్ల రాజన్నకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి చేరుతున్నట్లు దాసన్న రాజన్న తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని రాజన్న తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండ గొర్ల లింగన్న, అంబటి లక్ష్మణ్, కూకటికారి బుచ్చయ్య పాల్గొన్నారు.

ఇంటింటా చెట్లు.. ఊరంతా ఉద్యాన వనం



నవతెలంగాణ-తాండూర్

ప్రతి ఇంట్లో పూలు పండ్ల మొక్కలు నాటితే ఊరంతా ఉద్యానవనంలా తయారవుతుందని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాజీవ్‌నగర్ పంచాయతీలో ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటికి పూలు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. పూలు పండ్ల మొక్కల పెంపకంతో ఇంటి ఆవరణ ఆహ్లాదకరంగా మారుతుందని తెలిపారు. గ్రామాల్లోని ప్రతి ఇంటిలో పంపిణీ చేసిన మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్, పంచాయతీ సెక్రెటరీ కల్పన పాల్గొన్నారు.

బదిలీపై వెల్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, బదిలీపై వచ్చి, ఉద్యోగున్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రాథోడ్ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో పాటు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు రాజేశం, సుజాత, రొడ్డ మల్లేష్, కే రమేష్, జస్వింతకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ బాబు, లచ్చయ్య, రమణయ్య, సులోచన, రాజేష్, మహేష్, కృష్ణ, రజిత, పీఎస్ హెచ్ఎం ఎం సత్యనారాయణ, సీఆర్పీ మంతెన రమేష్ పాల్గొన్నారు.

వివిధ వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

2024-25 సంవత్సరానికి గాను సింగరేణి సేవా సమితి శ్రీరాంపూర్ ఏరియా ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్య కోర్సులకు మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కోర్సులైన టైలరింగ్, మగ్గంవర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, క్లాత్, జ్యూట్, బంజర బ్యాగ్స్ తయారి, కంప్యూటర్(డీటీపీ) కోర్సులను నేర్చుకొనుటకు ఆసక్తి గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర ప్రభావిత గ్రామాల మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డు, స్టడీ, కులం సర్టిఫికెట్, రెండు ఫోటోలతో పాటు పూర్తి వివరాలతో జూన్ 20 లోగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అందజేమారి కోరారు. వివరాలకోసం శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్‌లో సంప్రదించాలన్నారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటిన పోలీసులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



వన మహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ స్టేషన్ ఆవరణలో పండ్లు, పూల మొక్కలు పేట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాములును కులం పేరుతో దూషించిన భీమారం గ్రామానికి చెందిన కట్ట నాగరాజు అనే వ్యక్తిపై ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ రాములు తెలిపారు. దుర్గం రాములుకు చెందిన వ్యవసాయ భూమి సర్వే నెంబర్ 729లో సాగు చేసిన పత్తి పంటతో పాటు పరిసరాల్లో గల 35 ఎకరాల్లో రాత్రి సమయంలో అక్రమంగా ప్రవేశించి సాగు చేసిన పత్తిని ధ్వంసం చేసినట్లు దుర్గం రాములు పిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. సాగు చేసిన పత్తి పంటను ధ్వంసం చేయడంతో పాటు కులం పేరుతో దూషించినట్లు పేర్కొంటూ దుర్గం రాములు ఇచ్చిన పిర్యాదు మేరకు కట్ట నాగరాజుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, ఇతర నాయకులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా గ్రామంలో బొయిరె ప్రకాష్ కిరాణ దుకాణంలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మేము సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్ఐ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రకాష్‌ను అభినందించారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని, సీసీ కెమెరాలున్న గ్రామాల్లో ఎలాంటి కేసులు నమోదు కావడంలేదని తెలిపారు. గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగిన సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చన్నారు. సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తామని, నేరాల నియంత్రణ కోసం ప్రతి గ్రామంలో కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

వృత్తి నైపుణ్యత కోర్సులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రభావిత గ్రామ పంచాయతీల పరిధి మహిళల్లో వృత్తి నైపుణ్యతలను అభివృద్ధి చేయడం కోసం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పర్సనల్ మేనేజర్ రామ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, బ్యూటీషియన్ కోర్సుల్లో చేరే వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వనుండగా ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సుల్లో చేరే వారు కనీసం 7వ తరగతి విద్యార్హత కలిగిన మహిళలు అర్హులు కాగా కోర్సుల్లో చేరిన వారికి 3 నెలల్లో శిక్షణ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20 లోపు దరఖాస్తులు స్వీకరించనుండగా సింగరేణి సేవా సమితి ద్వార కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కరువు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కరవు అయ్యాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. మంగళవారం అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలు ప్రారంభం అయినా విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడం, టాయిలెట్స్ లేకపోవడం, విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని జిల్లా విద్య శాఖ కార్యాలయంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, వంశి, సుధాకర్, పాల్గొన్నారు.

ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన రంగుల భూమేష్‌గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. కొన్ని రోజుల క్రితం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన కూతురు రంగుల నిషిత ఢిల్లీలోని బిట్స్ పిలానిలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించిందని తెలుసుకొని ఆమె చదువుల కోసం రూ.30వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని తెలిపారు. విద్యార్థిని నిషితను అభినందించి బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలబడాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం ఉప్లూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని నిశితకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ముల రవీందర్, బోనగిరి లక్ష్మణ్, అవారి సత్యం, బోనగిరి భాస్కర్, సుంకరి విజయ్ కుమార్, పత్రి రవి, మంతెన బాజాగౌడ్, రాజశేఖర్, రంగు రాజేశ్వర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం చిన్నారుల చిరు సహాయం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం చిరు సహాయం చేసి ఆదర్శంగా నిలిచారు. వేల్పూర్ మండలం పోలీస్ స్టేషన్‌లో హెూంగార్డుగా పనిచేస్తున్న ముత్తెన్నకు బిపి పెరిగి మెదడులో నరాలు చిట్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సర్జరీ కోసం పెద్ద మొత్తంలో డబ్బు అవసరం కాగా తమ వంతు సహాయంగా విద్యార్థులు ఎస్,మణిదీప్, శరణ్యలు రూ.1000 సహాయం అందించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ సైతం రూ.2000 సహాయం అందించారు. ఉపాధ్యాయ బృందం మోహన్, విటల్, లింబాద్రి, గంగామోహన్, రేణుక, లావణ్య రాజేశ్వర్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

టోల్ ప్లాజా ఆధ్వర్యంలో పాఠశాలకు సహాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అత్వాంగ్ డిచ్‌పల్లి టోల్ వే ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సిఎస్ఆర్) నిధులతో ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం బోరు సదుపాయం, మరుగుదొడ్లు నిర్మించారు. టోల్‌ప్లాజా సిబ్బంది, టాయిలెట్ బ్లాక్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలలో రెండు గదులు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని వివరించారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీర్ రామారావు, టోల్ మేనేజర్ చలతిరావు, రూట్ మేనేజర్ విరాజ్, సేఫ్టీ అధికారి సతీష్ పానుగంటి, మేయింటెనెన్స్ ఇంజనీర్ కృష్ణకాంత్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ గణేష్, కమల్, ఉదయ్, మాజీ ఎంపిటిసి చింతల దాస్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ దర్పల్లి ప్రభాకర్, బిరిష్ శెట్టి, జర్గు రాజన్న, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్

గోదావరి ఇసుక అక్రమంగా తరలింపుకు పాల్పడితే చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోనున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జైపూర్ పోలీస్‌స్టేసన్ పరిధి ఇందారం శివారు నుండి గోదావరి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు డంపులను గుర్తించినట్లు తెలిపారు. స్థానిక ఎస్సై శ్రీధర్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించిన వారి వివరాలు వెల్లడించారు. ఇందారం కేంద్రంగా గోదావరి ఇసుక తవ్వకాలు జరుపుతున్న ఆక్రమణదారులు టిప్పర్ల ద్వార ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఇందారం శివారులో ఇటీవల 50 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులు గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా మంగళవారం మరో 30 ట్రాక్టర్ల ఇసుక డంపును గుర్తించి బాధ్యులైన వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి రూ.5 లక్షల స్వంత పూచికత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఇసుక రవాణాకు వినియోగించిన ట్రాక్టర్లు సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లు, ఓనర్లపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కాగా తహసీల్దార్ ఎదుట హాజరుపర్చిన వారిలో ఇందారం, రామారావుపేట్‌కు చెందిన జైనోద్దీన్, గుండ శ్రీనివాస్, సాయికృష్ణ, రాజ్‌కుమార్, స్వామి, శేఖర్, సంపత్, దీపులు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-వాంకిడి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి, మరమ్మత్తు పనులు చేపట్టి అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం మండలంలోని గోయగావ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వం పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిందన్నారు. ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాలతో పాటు మరమ్మత్తులు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, ఆస్పత్రి పరిసర ప్రాంతాలు, రిజిస్టర్లు, మందుల నిల్వను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు, విష జ్వరాలు వ్యాపించకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బాధితులకు సకాలంలో చికిత్స అందించేందుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్స్ డేను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

నవతెలంగాణ-దండేపల్లి

నేడు జరిగే దేశవ్యాప్త డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆశ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా యూనియన్ సీఐటీయూ చేస్తున్న పోరాటాలు చూసి మండలంలో ఆశాల సంఘం పీఆర్‌డీయూ నుంచి సిఐటియులో చేరారని ఆయన అన్నారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్ష కార్యదర్శులుగా పద్మ, లలిత కోశాధికారిగా రాధా అధ్యక్షత మంజుల, సువర్ణ సహాయ కార్యదర్శులుగా మాధవి, మంజుల, సలహాదారుగా లావణ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం మండల వైద్యాధికారి సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్ఎం పథకానికి బడ్జెట్ పెంచాలని ప్రయివేటీకరణ చేయకూడదని ప్రయివేటీకరణ వల్ల ఆశలకు నష్టం కలుగుతుందని ఆశాలకు నష్టం కలిగించే పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు శారద, లక్ష్మీ, సత్తమ్మ, వరలక్ష్మి లావణ్య, తారా, లలిత, సుమలత పాల్గొన్నారు.



హెచ్‌డీఎఫ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు



ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు

నవతెలంగాణ-జైపూర్

ఎస్టీపీపీ ఒప్పంద కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వార వేతనలు అకౌంట్ పొందివుండటం ద్వార సదరు బ్యాంకు వారు ఖాతాదారులకు అందిస్తున్న ప్రయోజనాలు పొందాలని ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. సింగరేణి డైరెక్టర్(పా) ఆదేశాల మేరకు మంగళవారం ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాలులో సింగరేణి-హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారి మధ్య జరిగిన అవగాహణ ఒప్పందంలో ప్రమాధ భీమాపై అవగాహణ కల్పించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా కలిగివున్న కార్మికులకు ప్రమాదంలో మృతి చెందితే రూ. 20 లక్షల ప్రమాద భీమా అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కార్మికుడు డెబిట్ కార్డు నెలలో ఒక సారి ఉపయోగించినా రూ. 10 లక్షల అదనపు భీమా ప్రయోజనం పొందడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కార్మికుడు ప్రమాదంలో మృతి చెందిన సందర్భంలో కుటుంబంలో 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా ఉండి చదువుకున్నట్లయితే వారికి రూ.4 లక్షల ఆర్థిక సాయం హెచ్‌డీఎఫ్‌సీ అందిస్తుందని తెలిపారు. ప్రమాదంలో అంగవైకల్యం పొందిన సందర్భంలో రూ. 20 లక్షల భీమా సదూపాయం అందుతుందని కార్మికుడు అనారోగ్య కారణాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నప్పుడు రోజుకు రూ.1000 చొప్పున 15 రోజుల పాటు ఆర్థిక సహాయం, ఏడాదిలో గరిష్టంగా రూ. 15 వేల ఆర్థిక సాయం పొందవచ్చునని తెలిపారు. ఈ మేరకు సింగరేణి, హెచ్‌డీఎఫ్‌సీ మధ్య సరిగిన అవగాహణ ఒప్పందం ద్వార కార్మికులకు జరుగు ప్రయోజనాన్ని జీఎం శ్రీనివాసులు కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రామ శాస్త్రి, ఎస్‌ఓటూ జీఎం వెంకటయ్య, ఎస్‌ఓటు ఈడీ ప్రభాకర్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లోని డాగ్‌స్క్వాడ్ మృతి

- సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ అటవీ కలప అక్రమ రవాణా దారుల గుండెల్లో గుబులు పుట్టించిన, డాగ్ స్క్వాడ్(చీతా) మృతి చెందింది. అటవీశాఖ అధికారులు మంగళవారం కుక్కకు అంత్యక్రియలు నిర్వహించారు. జర్మనీ షెఫర్డ్ చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కుక్క పేరు చీతా ఆ పేరు వింటేనే స్మగ్లర్ల గుండెల్లో గుబులు పుట్టించేంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల పులుల అభయారణ్యంలోని జన్నారం డివిజన్‌కు 2018 డిసెంబర్ 15న మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ లో ప్రత్యేక శిక్షణ పొందిన స్థానిక అటవీ బీట్ అధికారులు శ్రీగాద శ్రీనివాస్, జాడి సత్యనారాయణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జర్మనీ షెఫర్డ్ చీతా(కుక్క)ను ఇక్కడికి తీసుకొచ్చారు. ఆ చీతా గుండెపోటు గురై సోమవారం మృతి చెందింది. ఆ తర్వాత వెటర్నరీ డాక్టర్ చే పోస్టుమార్టం నిర్వహించి స్థానిక అటవీ శాఖ సముదాయ ప్రాంతంలో సంప్రదాయ పద్ధతిలో తాళ్ళపేట, జన్నారం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, ఇందన్‌పెల్లి రేంజ్ ఆఫీసర్ ఎండీ హఫీజోద్దీన్, డిప్యూటీ రేంజ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు తిరుపతి, హైమావతి, మమత శ్రీనివాస్, రైమోద్దీన్, డివిజన్ సూపరిండెంట్ షమీమోదీన్, అసిస్టెంట్ రవీందర్‌లు సంప్రదాయ పద్ధతిలో ఖననం చేశారు.

ఆషాడ మాస వేడుకలు



నవతెలంగాణ-భైంసా

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫాక్టరీలో ఆషాడ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను మంగళవారం జరుపుకున్నారు. మహిళ నాయకురాళ్లంతా కలిసి చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. ఆడపడుచులు ఆషాడ మాసంలో గోరింటాకు ధరించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. మహిళలు పసుపు కుంకుమ ఒకరినొకరు పెట్టుకొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా నాయకురాలు రజిని, మహిళా మోర్చా ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ సిరం సుష్మరెడ్డి, మండల నాయకులు అనసూయ, సుజాత సరస్వతి పాల్గొన్నారు.

పాతికేండ్ల వయస్సు వచ్చినా.. ఇప్పటికీ చిన్న పిల్లలే..



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన కుర్రాడి లక్ష్మి గంగారాం దంపతులకు నలుగురు కుమారులు కాగా, అందులో శ్రీనివాస్(32), గంగన్న(35) ఇద్దరు కుమారులు పుట్టినప్పటి నుంచి మానసిక దివ్యాంగులగా ఉన్నారు. దివ్యాంగులను ఎన్నో ఆస్పత్రులకు చికిత్స కోసం తిరిగి వారికి నయం కాలేదు. కనీసం నడవలేరు. వీళ్ల బయటకు వెళ్లాలంటే తల్లిదండ్రులు మోయాల్సిందే లక్ష్మి తన కుమారులకు చేస్తున్న సేవలు చూస్తే అందరి గుండెలు తరుక్కుపోతాయి. పాతికేండ్లకు పైగా వయస్సున్న ఇద్దరు కొడుకులు ఇప్పటికీ చంటి బిడ్డల్లా సేవలు చేస్తోంది. పుట్టుక నుంచి శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ అన్ని సేవలు చేస్తూ వృద్ధాప్యంలోనూ ఆ మాతృమూర్తి మోస్తున్న భారం వర్ణనాతీతం ఈ మానసిక వికలాంగులకు ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలి

నవతెలంగాణ-భైంసా

జీఓ నెంబర్ 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు వీఆర్ఏ వారసులు వినతిపత్రాన్ని అందించారు. బైంసా డివిజన్ నుంచి వీఆర్ఏ వారసులంతా వచ్చి ఎమ్మెల్యేను కలిశారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తుతానని, జీఓ ప్రకారం ఉద్యోగాలు ఇప్పించేటట్టు చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో భూమన్న, సాయినాథ్, అనిల్, సురేష్, నవీన్, పోతన్న ఉన్నారు.

నిధులు కేటాయించండి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ మున్నూరు కాపు కుల పెద్దలు, ఫంక్షన్ హాల్ నిర్మాణ కమిటీ సభ్యులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి వినయ్‌రెడ్డి మంగళవారం కలిశారు. గతంలో కేటాయించిన స్థలంలో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా వినయ్‌రెడ్డి సానుకూలంగా స్పందించి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కుల పెద్దలు వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రాము, కాంగ్రెస్ నాయకులు రవిగౌడ్, కాశీరాం అయ్యప్ప, శ్రీనివాస్, కులపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వెల్‌నెస్ సెంటర్‌కు అదనపు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పలుసార్లు కలెక్టర్‌ని, మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. డాక్టర్లు కూర్చోవడానికి, ఒపి సేవలందించడానికి డెంటల్, ఈసీజీ, ఫిజియోథెరపీ సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ పరిస్థితిని సరిదిద్దాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ఎకామిడేషన్ సరిపోవటం లేదని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రామ్మోహన్‌రావు, వెల్‌నెస్ సెంటర్ కో ఆర్డినేటర్ కృష్ణవేణి, కమిషనర్‌కు వివరించారు. బాత్రూంలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న రూమ్స్‌ను పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిషనర్‌తో పాటు పెన్షనర్ల సంఘ నాయకులు ప్రసాద్‌రావు, రాధా కిషన్, భోజారావు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విడిసి సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూర్ విడిసి సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసి గ్రామ సమస్యల గురించి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛంను అందజేశారు. గ్రామంలో గుట్ట మీద గుడి నిర్మాణం, నిజామాబాద్ నుంచి భీంగల్ వరకు బస్ వేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేయడం జరిగిందని కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రములోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ రాజేంద్రసాహు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు చేలైలా శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాధిక, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.